పింఛన్ల పండగ.. ఆనందం నిండుగా..



కడియంలో పింఛన్ అందిస్తున్న సచివాలయ కన్వీనర్లు కవల వెంకన్న, మద్దిరాల రూనాన్సీరాణి



నగరంలోని మూడో డివిజన్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

- ఉత్సాహంగా పెన్షన్ల పంపిణీ
- లబ్ధిదారుల ఆనందం

కడియం: మండలంలోని లబ్ధిదారులకు పెంపుదల చేసిన పెన్షన్ మొత్తాన్ని బుధవారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పంపిణీ చేశారు. ప్రతినెలా ఇచ్చే రూ. 2,500కు అదనంగా రూ.250 కలిపి మొత్తం రూ.2,750ను అందజేశారు. తెల్లవారుజాము నుంచే ఈ పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. బుధవారం ఉదయం 11 గంటల సమయానికే కడియం మండలం పరిధిలో సుమారు 60 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

కడియం మండలంలో..

కడియం మండలంలోని 11 పంచాయతీల్లోనూ 11,462 మంది వృద్ధాప్య, వితంతు, చేనేత వికలాంగ పెన్షన్లను లబ్ధిదారులు అందుకుంటున్నారు. ఇందుకోసం ప్రతినెలా రూ.2,97,09,500 కేటాయిస్తున్నారు. ఇప్పుడు మరో 456 మందికి కొత్తగా మంజూరు చేశారు. దీంతో అదనంగా ప్రతినెలా రూ.12,54,000 కేటాయించారు. కొత్తగా మంజూరైనవారు ఈ నెల 7వ తేదీన కడియంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో నిర్వహించే కార్యక్రమంలో తొలిసారిగా పింఛన్లు అందుకోనున్నారు.

లబ్ధిదారుల ఆనందం

పెంచిన పెన్షన్ మొత్తాన్ని అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ తమకు అందిస్తున్న పింఛన్ ఎంతో ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. ఎవ్వరిపైనా ఆధారపడకుండా జీవించే ధైర్యం కల్పిస్తోందన్నారు. ప్రతి నెలా సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో గ్రామ వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేసేవారు. మరింత సమర్థవంతమైన సేవలను లబ్ధిదారులకు అందించే క్రమంలో సచివాలయ కన్వీనర్లను ప్రభుత్వం నియమించింది. ప్రతి లబ్ధిదారుడికి వలంటీర్‌తో పాటు సచివాలయ కన్వీనర్ కూడా పెన్షన్ అందిస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అందుతున్నదీ? లేనిదీ? అడిగి తెలుసుకుంటున్నారు. ఎవరైనా అర్హత ఉండి సదరు సంక్షేమ పథకం అందకపోతే అందుకుగల కారణాలను నమోదు చేసుకుంటున్నారు. తద్వారా అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు కోల్పోకూడదన్నదే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు సేవలు ప్రారంభించారు.

3వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను దశల వారీగా పెంచుతున్నారని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక 3వ డివిజన్‌లో ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బళ్లా శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు గుత్తుల జోగారావు, ఎమ్మి ఖలీల్ పాల్గొన్నారు.

అర్హత ఉంటే పథకం అందాల్సిందే



అర్హత ఉన్న ప్రతి వారికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకం అందాల్సిందే. ఇందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు సమన్వయంతో కృషి చేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది.

– చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



బ్యాటింగ్ చేస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: యువత చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వక్తలు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అజ్జరపు వాసు ఆధ్వర్యంలో ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ సంక్రాంతిని పురస్కరించుకుని అజ్జరపు లక్ష్మి, సుందరరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు బుధవారం లాలాచెరువు నుంచి క్వారీ మార్కెట్‌కు వెళ్లే రోడ్డులోని ఎస్‌బీ వెంచర్స్‌లో ప్రారంభమైంది. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ తల్లిదండ్రులైన అజ్జరపు లక్ష్మి, సుందరరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను పదేళ్లుగా అజ్జరపు వాసు నిర్వహించడం అభినందనీయమన్నారు. అజ్జరపు వాసు మాట్లాడుతూ క్వారీ ఏరియాలోని 44, 45, 46, 47, 48, 49, 50, 1, 2 డివిజన్ల యువతను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా సంక్రాంతి సంబరాల పేరుతో వివిధ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నక్కా శ్రీనగేష్, మాజీ కార్పొరేటర్లు మానె దొరబాబు, కంచుమర్తి చంటి, గుత్తుల మురళీధర్ పాల్గొన్నారు.

గోదావరి రక్షణకు సీఎం సానుకూల స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: గోదావరిని కాలుష్యం నుంచి పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం నగర పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌ను స్టేడియంలోని హెలిప్యాడ్ వద్ద కలిసి, గోదావరిలో వ్యర్థ జలాలు కలుస్తున్న విషయాన్ని, తన దీక్షను, కార్పొరేషన్ నుంచి వచ్చే వ్యర్థజలాలు, మల,మూత్ర విసర్జితాలను డ్రైనేజీల్లో కలిపేస్తున్న విషయాన్ని వివరించానన్నారు. దీనిపై సీఎం వెంటనే స్పందించి.. కలెక్టర్‌ను పిలిచి మాట్లాడారన్నారు. అదే క్రమంలో ఆయన ఓఎస్డీని పిలిచి తాడేపల్లి వెళ్లిన వెంటనే ఈ సమస్యను ప్రాసెస్‌లో పెట్టాలని ఆదేశించారన్నారు. సమావేశంలో బర్రే కొండబాబు, కానుబోయిన సాగర్, పినిశెట్టి సుబ్బరాజు, కొంచాడ ఈశ్వర్, రేగుళ్ల బాల శ్రీధర్, ఎస్.వీరభద్రం పాల్గొన్నారు.

గొందేశి ట్రస్టు సేవలు అభినందనీయం



విద్యార్థులకు వాటర్‌టిన్లు అందజేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణారావు అన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు, న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు వాటర్‌టిన్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రాయుడు శివప్రసాద్, సూరంపూడి సూర్యప్రకాష్, సీతారామ్, వైఎస్సార్ సీపీ నాయకుడు మత్సేటి శివ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నాని ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో..

శ్రీనివాసులురెడ్డి పుట్టినరోజు సందర్భంగా బొమ్మూరులోని రూత్ ఓల్డేజ్ హోమ్‌లో నాని ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే రూ.5 వేలు విలువైన వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, ముద్దాల అను, మత్సేటి శివ, మేడపాటి సద్గుణ రామారెడ్డి, చరణ్, దుర్గ ప్రసాద్, కొల్లి రాము, హోమ్ నిర్వాహకులు బీవీ రావు పాల్గొన్నారు.

'నన్నయ'లో సంక్రాంతి వేడుకలు



నన్నయ ప్రాంగణంలో ముగ్గుల పోటీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా ప్రారంభించారు. పండగల విశిష్టతను తెలియజేసేలా తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరుపుకొంటున్న ఈ సంబరాలను ఈసారి కాస్త ముందుగానే చేపట్టారు. విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలిరోజు సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో 123 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. గురు, శుక్రవారాలలో కూడా ఈ సంబరాలు కొనసాగుతాయి. భోగి మంటలు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు కీర్తనలు తదితర వాటిని ప్రదర్శించనున్నారు.

వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రం ప్రారంభం



బిక్కవోలులో వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ జ్యోతిర్మయి

బిక్కవోలు: బిక్కవోలు మండల పరిషత్ కేంద్రం వద్ద వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రం ఏర్పాటు వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీ మాట్లాడుతూ పంచాయతీల నుంచి వర్మీ కంపోస్ట్‌ను తీసుకొచ్చి విక్రయానికి ఉంచుతున్నామన్నారు. దీనిపై వచ్చిన ఆదాయాన్ని తిరిగి ఆయా పంచాయతీలకు అందిస్తామని చెప్పారు.

ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2022–23 సవరణ, 2023–24 అంచనా బడ్జెట్‌ను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, తహసీల్దార్ పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు.. రికార్డు వసూళ్లు

15 రోజుల్లో శత శాతం ఇంటి పన్నుల వసూలు

అనపర్తి: గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లలో మండలంలోని కొప్పవరం వలంటీర్లు వరుసగా రెండో ఏటా తమ సత్తా చాటారు. సాధారణంగా పంచాయితీలు జనవరి నెల ప్రారంభం నుంచి ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేసి మార్చి నెలాఖరులోపు పన్నులు వసూలు చేస్తుంటారు. అయితే కొప్పవరం గ్రామ పంచాయితీ పరిధిలో ఇంటి పన్నుల వసూలుకు బిల్లు కలెక్టర్ లేకపోయినా వలంటీర్లు పన్నుల వసూలు బాధ్యతగా తీసుకుని కేవలం 15 రోజుల్లోనే 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించినట్లు పంచాయతీ కార్యదర్శి తాడి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఇంటిపన్నుల మొత్తం డిమాండ్‌ను రూ.6,13,846 కేవలం 18 రోజుల్లో వసూలు చేసి రికార్డు నెలకొల్పిన వలంటీర్లు 2022–2023 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.8,13,212 మొత్తం లక్ష్యాన్ని కేవలం 15 రోజుల్లోనే వసూలు చేసి రికార్డును తిరగరాశారన్నారు. డిసెంబరు 21న పన్నుల వసూళ్లు ప్రారంభించిన వలంటీర్లు జనవరి 4వ తేదీ నాటికి నూరుశాతం పన్నుల వసూళ్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు

మధురపూడి: సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. శ్రీరంగపట్నం హైస్కూల్లో పరీక్షను ఎంఈఓ కుశలవ దొర పరిశీలించారు.

టీటీడీ ప్రచార రథానికి ఘన స్వాగతం



నల్గొండలో ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతానగరం: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార రథానికి బుధవారం నల్గొండ గ్రామంలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వీధుల్లో పసుపు నీరు చల్లుతూ స్వామివారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవింద నామ స్మరణ మార్మోగింది. ముందుగా మంగళవారం రాత్రి గ్రామంలోని రామాలయం వద్దకు రథం చేరుకుంది. ప్రచార రథం ప్రెసిడెంట్, గాయకుడు కరుటూరి వెంకట శ్రీనివాసరావు అన్నమాచార్య సంకీర్తనలు అద్భుతంగా ఆలపించారు. బుధవారం తెల్లవారుజామున పూజల అనంతరం నల్గొండ వీధుల్లో పర్యటించింది. సాయంత్రానికి సీతానగరం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు చేరుకుంది.

టిష్యూ కల్చర్ లాబ్, డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన టిష్యూ కల్చర్ లాబ్, డిజిటల్ లైబ్రరీలను వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు బుధవారం ప్రారంభించారు. ఎంచుకున్న స్పెషలైజేషన్ కోర్సుల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, టిష్యూ కల్చర్‌లో ఆధునిక పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. డిజిటల్ లైబ్రరీలో ఇంటర్నెట్ సదుపాయంతో 25 కంప్యూటర్లు ఉంటాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్, బుక్స్, ఆన్‌లైన్ పరిశోధనలకు విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ఆక్వాపోనిక్స్, అజొల్లా కల్చర్ (గ్రీన్ టెక్నాలజీ), వివిధ రకాల చేపల పెంపకానికి సంబంధించిన యూనిట్లను సందర్శించి, విద్యార్థులను ప్రతిభను కొనియాడారు. ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ కేవీ స్వామి పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జయంతి



కొంకుదురులో మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

బిక్కవోలు: సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమని కొంకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అమ్మిరెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా ఆమె ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా ధైర్యంగా నిలబడి గొప్పస్థాయికి ఎదిగారని, ఆమెను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినిలు చాగంటి వాణిసులోచన, మాచవరపు శిరిష, నేకూరి నిర్మలా జ్యోతిలను ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

సావిత్రీబాయి నేటి తరానికి ఆదర్శం



ప్రముఖులను సత్కరిస్తున్న ఎంఈవో లజపతిరాయ్

కడియం: మహిళా విద్యకు నాంది పలికిన సావిత్రీబాయి పూలే నేటి తరానికి ఆదర్శమని ఎంఈవో వి.లజపతిరాయ్ అన్నారు. వేమగిరితోట ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రీబాయి జయంతి నిర్వహించారు. హెచ్ఎం జయరాజ్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడారు. బోధనలో విశిష్ట సేవలందించిన యాతం నాగమణి, కుమారి, పావనిలను ఘనంగా సత్కరించారు. విద్యార్థిని ప్రదర్శించిన సావిత్రీబాయి ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. విద్యా కమిటీ చైర్మన్ అమల, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



మాట్లాడుతున్న ఈశ్వరరావు, సత్యనారాయణ

కడియం: ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న రోడ్డు షోలు, ధర్నాలు, రోడ్డుపై సమావేశాలను నిషేధిస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని స్థానిక రైతు నాయకులు చిక్కాల ఈశ్వరరావు, బోణం సత్యనారాయణ, చుండూరి రామచంద్రరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కడియంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వీటిని నిషేధించాలని తాము ఎప్పట్నుంచో కోరుతున్నామన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. అలాగే ప్లాస్టిక్ నిషేధాన్ని కూడా చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నిరసన

సీటీఆర్ఐ: రాష్ట్రంలో చీకటి జీవోలు తీసుకువచ్చి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ర్యాలీలు, రోడ్డుషోలు, బహిరంగ సభలపై జీవో తీసుకు రావడాన్ని నిరసిస్తూ బుధవారం ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జీవో ప్రతులను దహనం చేశారు. తాటిపాక మధు, కుండ్రపు రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజా పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, డి.సూర్యనారాయణ, ఉర్రింకల శ్రీను ఉన్నారు.

టీడీపీ నాయకుల పర్యటన

సీటీఆర్ఐ: ప్రజాసమస్యలు తెలుసుకోవడానికి టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ రావడం జరుగుతుందని టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు అన్నారు. బుధవారం స్థానిక 4వ డివిజన్‌లో టీడీపీ నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డివిజన్‌లో కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి అప్పారావు, గన్నికృష్ణ, నక్కా చిట్టిబాబు, దేవీవరప్రసాద్, బండారు శ్రీను పాల్గొన్నారు.

ప్రయోగాలపై అవగాహన



ప్రయోగాలను వివరిస్తున్న శ్రీకృష్ణసాయి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం వివిధ ప్రయోగాలపై కొంకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (భౌతిక శాస్త్రం) కె.శ్రీకృష్ణసాయి అవగాహన కల్పించారు. చేతివేళ్లకు నిప్పు అంటించుకోవడం, పెన్సిల్‌తో, బియ్యంతో నింపిన సీసాను పైకి లేపడం వంటి వాటిని ప్రదర్శించారు. వాటి వెనుక ఉన్న శాస్త్రీయ భావనను వివరించారు. అనంతరం ఆయనను డైట్ అధ్యాపకుడు కేవీ సూర్యనారాయణ సత్కరించారు. అధ్యాపకులు సుజాతా రత్నం, జానకీదేవి, ఎస్తేర్, చూడామణి, కళావతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమ్మేటివ్-1 పరీక్షలు ప్రారంభం

సీటీఆర్ఐ: అన్ని యాజమాన్యాల పాఠశాలలకు బుధవారం నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు ప్రారంభమైనట్టు అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. జిల్లా పరీక్షా నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ద్వారా ప్రశ్నపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఏరోజుకారోజు ఆ సబ్జెక్టు ప్రశ్నపత్రాలను పరీక్షా సమయానికి ఒక గంట ముందు ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామన్నారు. వాటిని స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్‌లో భద్రపరిచామన్నారు. ప్రశ్నపత్రాలు తక్కువైతే ప్రధానోపాధ్యాయులు స్టోరేజ్ కేంద్రం నుంచి తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జిరాక్స్ తీయరాదన్నారు.

ఉద్యమాలతో హక్కుల సాధన

సీటీఆర్ఐ: ఐక్య ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయుల హక్కులను సాధించుకోవాలని ఫ్యాప్టో చైర్మన్ పి.జయకర్ అన్నారు. అమరజీవి పీబీ ముత్తారావు హాల్లో బుధవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు సాధించబడతాయన్నారు. సెక్రటరీ జనరల్ శేషబ్రహ్మం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్టీఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా సీసీటీవీ(సెక్యూరిటీ కెమెరా) ఇన్‌స్టలేషన్, జ్యూట్ బ్యాగ్ తయారీలో (స్త్రీలు, పురుషులు) 13 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు వయసు ఉండి, 10వ తరగతి పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు గురువారం నుంచి ఈనెల 12వ తేదీలోపు కార్యాలయంలో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 90143 28803, 0883-2428807 నంబర్లను సంప్రదించాలన్నారు.

మనదేశ విజ్ఞానం ప్రపంచానికే ఆదర్శం



ప్రసంగిస్తున్న డాక్టర్ వీకే రాజు

సీటీఆర్ఐ: భారతదేశ విజ్ఞానం ప్రపంచానికే ఆదర్శమని ప్రముఖ వైద్యుడు (అమెరికా) డాక్టర్ వీకే రాజు అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం, కళాశాల వైద్యకేంద్రం, పూర్వ విద్యార్థుల సంఘం, వాగ్దేవి చారిటబుల్ ట్రస్టు, గౌతమీ నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో అన్ని రకాల రోగాలకు వైద్యం ఉందని, కానీ మనం దానిని విస్మరిస్తున్నామన్నారు. తాను చదువుకున్న కళాశాలలోనే ప్రసంగించడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చప్పిడి కృష్ణ, గౌతమీ నేత్రాలయం ఎండీ వీవీ కుమార్, దుర్గారావు, శ్రీశైల శాస్త్రి పాల్గొన్నారు.

సారా తయారీ, రవాణాపై కఠిన చర్యలు

రంగంపేట: మండలంలో ఎవరైనా సారా తయారీ, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి హెచ్చరించారు. స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో బుధవారం మహిళా పోలీస్‌లతో ఆమె సమావేశం నిర్వహించారు. సారా, గుట్కా, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై తీసుకోవలసిన చర్యలపై మహిళా పోలీస్‌లకు వివరించారు. మండలంలోని ఈలకొలను గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. సారా తయారీకి బెల్లపుఊట తయారుచేసిన వారిని గుర్తించి వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఎంఎస్‌పీ ఆవిర్భావ దినోత్సవం

సీటీఆర్ఐ: మంద కృష్ణ స్థాపించిన మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. తాడితోట సెంటర్‌లో పార్టీ జెండా ఎగురవేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి వైరాల అప్పారావు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అనే నినాదంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఈ పార్టీని స్థాపించారన్నారు. కార్యక్రమంలో చిన్న సుబ్బారావు, రమేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.